



రుణమాఫీ సరే భరోసా ఏది..?

- చివరి దశకు చేరిన వరినాట్లు
- రైతు భరోసా ఊసే ఎత్తని ప్రభుత్వం
- పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు

మంచిర్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వానా కాలం వరి నాట్లు చివరి దశకు చేరుకున్నాయి. సాగు పెట్టుబడి సాయం ఇంకా అందలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కార్ మూడు విడతల్లో రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేసింది. వివిధ కారణాలతో చాలా మంది రుణాలు మాఫీ కాలేదు. ఓ వైపు రుణమాఫీ అందక, మరోవైపు కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు భరోసా అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

• ఎకరాకు రూ.15 వేలు చెల్లించేదెప్పుడో...?

తాము అధికారంలోకి రాగానే రైతు భరోసా పథకం కింద అర్హతగల రైతులందరికీ ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం యాసంగిలో పాత పద్ధతిలోనే ఎకరాకు రూ.8 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. వానాకాలం నుంచి ఎకరాకు రూ.15 చొప్పున పెట్టుబడిసాయం అందజేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా

మూడు విడతల్లో రూ.461 కోట్లు రుణమాఫీ

జిల్లాలోని 56,020 మంది రైతులను రుణమాఫీ పథకానికి ఎంపిక చేయగా, వారిలో 55,778 మందికి నగదు జమ చేశారు. వారి బ్యాంకు ఖాతాల్లో మూడు విడతల్లో రూ.461 కోట్ల 86 లక్షలను ప్రభుత్వం జమ చేసింది. అన్ని అర్హతలు ఉండి, వివిధ కారణాల చేత మూడు విడుతల్లో రుణమాఫీ పొందని రైతులు జిల్లాలో 242 మంది ఉన్నారు. అనేక కారణాల చేత జిల్లా వ్యాప్తంగా పలువురు రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. మరో వైపు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసాపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో పెట్టుబడుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులు, ఎరువుల డీలర్ల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ మొదటి విడుతలో 28,392 మందికి రూ.149 కోట్ల 46 లక్షలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయగా, రెండో విడుతలో 14,365 మందికి రూ. 138 కోట్ల 65 లక్షలు, మూడో విడుతలో 13,021 మంది రైతులకు రూ. 173.75 కోట్లను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

రైతుభరోసా పథకం విధివిధానాలు ఖరారు చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. అయితే పథకం అమలుకాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

• గత ప్రభుత్వానికి భిన్నంగా....

గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధులో అనేక తప్పిదాలున్నాయని భావించిన కాంగ్రెస్ సర్కారు, దానిని రైతుభరోసా పథకంగా మార్చింది. కొత్తపథకం విధి విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం జూలై 15 లోగా నివేదిక సమర్పించాలని సూచించింది. దీనికి అనుగుణంగా ఉమ్మడి జిల్లాల స్థాయిలో మంత్రులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. పథకంలో మార్పులు తేవాలని కొందరు, ఐదెకరాల్లోపు రైతులకు పథకం వర్తింపజేయాలని మరికొందరు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అలాగే 10 ఎకరాలను కటాఫ్‌గా పెట్టాలని రాజకీయనేతలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవద్దని వివిధ వర్గాలు తమ అభిప్రాయాలను తెలియజేశాయి. మంత్రివర్గ ఉపసంఘం అందించిన నివేదికను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాల్సి ఉండగా, రైతు భరోసాపై ఎలాంటి చర్చ లేకుండానే సమావేశాలు ముగిశాయి. దీంతో ఈ సీజన్‌కు రైతు భరోసా అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీ కోసం కుటుంబ నిర్ధారణ సర్వే

నెన్నెల, ఆగస్టు 29: రుణమాఫీ కాని రైతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. గురువారం ఖైలారంలో ఇంటింటి సర్వే చేపట్టారు. రేషన్ కార్డు లేక కుటుంబ సభ్యుల నిర్ధారణ కాకుండా చాలా మందికి రుణమాఫీ కాలేదు. అలాంటి వారి జాబితా రూపొందించి కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లను పోర్టల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. రైతు కుటుంబంతో ఏఈవో సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేస్తున్నారు. క్లస్టర్ల వారీగా అన్ని గ్రామాల్లో సర్వే చేపడుతామని నెన్నెల, నందులపల్లి ఏఈవోలు రామ్‌చందర్, సుప్రజా తెలిపారు. రేషన్ కార్డులు లేని రైతులు, కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని కోరారు.

జన్నారం: కవ్వాలలో రుణమాఫీ పథకంలో రేషన్ కార్డు లేని రైతులకు కటుంబ సభ్యుల ధ్రువీకరణకు మండల వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించారు. రేషన్‌కార్డు లేని వారికి మాత్రమే ప్రస్తుతం సర్వే నిర్వహించి యాప్‌లో ఫొటో తీసుకొంటున్నారు. ఏఈవో అక్రముల్లా, రైతులు సక్రునాయక్, కలిరాం, రమేష్, సత్తన్న పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏసీసీ, ఆగస్టు 29: మంచిర్యాల మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 60 సంవత్సరాల పైబడిన వారి స్థానంలో కుటుంబీకుల్లో ఒకరికి అవకాశం కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రేయిన్‌కోట్లు అందించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులను పర్మనెంటు చేసే వరకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాని, పీఎఫ్, ఈఎస్ఐ అకౌంట్లలో ఉన్న తప్పులను సరి చేయాలని, డ్రైవర్లకు స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంకుమార్, శ్రీనివాస్, రామస్వామి, తిరుపతి, నవీన్, రాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి

మందమర్రిరూరల్, ఆగస్టు 29: ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో జాడి పోచయ్య సూచించారు. గురువారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, సమయపాలన పాటించాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్, ఎఫ్ఏ 1,డేటా ఎంట్రీ, బేస్‌లైన్‌టెస్టుల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. నోడల్ అధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు దత్తుమూర్తి, శ్రీనివాస్, పద్మజ, అనురాధ, పద్మశ్రీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి



మందమర్రిలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్, వేలాలలో సబ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్, కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రి టౌన్, ఆగస్టు 29: అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం ఆయన పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. 24వ వార్డు ఊరు మందమర్రి, 6వ వార్డు, నార్లాపూర్‌లో పాదయాత్ర, మరికొన్ని వార్డుల్లో ద్విచక్ర వాహనంపై వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీలో అధికారులు ప్రజలకు జవాబుదారీగా పని చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, వార్డుల్లో చెత్తా చెదారం నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎర్రగుంటపల్లె, ఊరు మందమర్రిలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు మున్సిపాలిటీలో రూ.కోటి 50 లక్షలతో పనులు చేయాలని మున్సిపల్ ఇంజనీర్ అచ్యుత్‌ను ఆదేశించారు. ఎర్రగుంటపల్లె వాగుపై వంతెన నిర్మాణం చేపట్టేందుకు అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, బండి సదానం దం, అబ్దుల్ అజీజ్, గుడ్ల రమేష్, మంద తిరుమల్, ఒడ్నాల కొమురయ్యపాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ కావాలని తనపై బురద జల్లుతున్నారని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించలేదని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలను తొలగిస్తుంటే తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ కట్టడాలపై ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

జైపూర్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. వేలాలలో రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్‌ను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, డాక్టర్ శ్రావ్య, నాయకులు పాల్గొన్నారు.

భీమారం: రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించనున్న పీహెచ్‌సీ నిర్మాణ పనులకు కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. మంచిర్యాల ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్‌కుమార్, నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి, గద్దె రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, అమర్‌సింగ్‌నాయక్, రవి, పాల్గొన్నారు.

మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన నైతం బానయ్య కూలీ మృతిచెందగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును బానయ్య భార్యకు ఎమ్మెల్యే అందజేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న డీఈవో యాదయ్య

వేమనపల్లి, ఆగస్టు 29: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. గురువారం క్యాతనపల్లి, కల్మలపేట, ముల్కలపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. క్యాతనపల్లి పాఠశాల ఉపాధ్యాయులు సునీల్‌కుమార్ సమయానికి హాజరు కాకపోవడంతో డీఈవో సస్పెండ్ చేశారు. అలాగే పాఠశాలలకు ఆలస్యంగా హాజరైన క్యాతనపల్లి ఉపాధ్యాయురాలు శ్యామల, ముల్కలపేట ఉపాధ్యాయురాలు కవితలకు షోకాజ్ నోటీసులు అందజేశారు. పాఠశాలల్లోని రికార్డులను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. పాఠశాలకు రాకున్నా రిజిష్టర్‌లలో సంతకాలు చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. సెక్టోరల్ అధికారిచౌదరి, కాంప్లెక్స్ హెచ్ఎంగిరిధర్‌రెడ్డి, సీఆర్‌పీలు ఉన్నారు.

కోటపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని డీఈవో యాదయ్య ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గురువారం పాత సూపాక, కొత్త సూపాక, వెంచపల్లి ప్రాథమిక పాఠశాలలతోపాటు పారుపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నైపుణ్యాలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయపడవద్దని ప్రతి సబ్జెక్టును అర్థం చేసుకోవాలని, సులభంగా ఉన్న అధ్యాయాలను నేర్చుకోవాలన్నారు. సెక్టోరియల్ అధికారి చౌదరి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నెన్నెల, ఆగస్టు 29: కస్తూర్బా పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్ పిల్లలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తరువాత, మరుగుదొడ్డి ఉపయోగించిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ వసుమతి, హెల్త్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఫార్మసిస్టు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: అస్నాదలో గురువారం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. 112 మందికి పరీక్షలు నిర్వహించగా ఏడుగురు జ్వరంతో ఉన్నట్లు గుర్తించి రక్త నమూనాలను సేకరించి మందులను అందజేశారు. వైద్యుడు వారిష్‌బాన్, హెచ్ఈవో జగదీష్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు 29: విష జ్వరాలు ప్రబలకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లి సాగర్ పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా విస్తరిస్తున్నాయన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక ఫీజులు తీసుకోకుండా నియంత్రించాలని కోరారు.

రేపు జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన

మంచిర్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 31న మంచిర్యాల జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు హైద్రాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా పెద్దపల్లి జిల్లా రామగుండం, గోదావరిఖనిలో పర్యటించిన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు రోడ్డు మార్గంలో చెన్నూరుకు చేరుకోనున్నారు. అక్కడ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లానెట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం 5.20 వరకు జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)ను సందర్శించనున్నారు. ఎస్టీపీపీలోని ఫ్లోటింగ్ సోలార్‌ను సందర్శించి అడ్మిన్ బ్లాక్ ప్రారంభోత్సవం, కంట్రోల్ రూం, సీఓ 2 మిథనాల్ ప్లాంట్‌తోపాటు 800 మెఘావాట్ల థర్మల్ ప్లాంట్ మూడో యూనిట్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం హైద్రాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.

నేటితో ముగియనున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు

దండేపల్లి, ఆగస్టు 29: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకులు అక్టోబర్‌లో జరిగే పరీక్షలకు శుక్రవారం ఫీజ్ చెల్లించాలని దండేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బీసగోని శంకర్‌గౌడ్, సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాల నుండి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొంది పరీక్ష రాయని అభ్యాసకులు, పరీక్షలు రాసి ఫెయిల్ అయిన వారు ఫీజు చెల్లించవచ్చన్నారు. పరీక్ష ఫీజ్‌ను ఓపెన్ టెన్త్ సబ్జెక్టుకి రూ.100, ఇంటర్ రూ.150 చొప్పున మీసేవ కేంద్రం, ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదు పొందాలన్నారు. వివరాలకు 8309769067లో సంప్రదించాలన్నారు.

ప్రైవేట్ క్లీనిక్‌లలో తనిఖీలు

చెన్నూరు, ఆగస్టు 29: పట్టణంతోపాటు మండల కేంద్రంలోని ప్రైవేటు క్లీనిక్‌లపై టీజీఎంసీ, ఐఎంఏ కమిటీ బృందం అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. వైద్య మండలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధికారుల ఆదేశాల మేరకు చెన్నూరు, భీమారంలోని క్లీనిక్‌లను తనిఖీ చేసినట్లు కమిటీ సభ్యులు ఎగ్గని శ్రీనివాస్ తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీలు మోతాదుకు మించి యాంటీ బయోటిక్ మందులను వాడుతున్నట్లు తెలిపారు. అనారోగ్య సమస్యలుంటే అన్ని అనుమతులు ఉన్న వైద్యులను లేదా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని కోరారు. ప్రైవేటు క్లీనిక్‌లలో లభించిన మందులను ఐఎంసీకి పంపించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ అనిల్ (హెచ్ఆర్‌డీఏ), ప్రసాద్, శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్ఎంపీలు

చెన్నూరు, ఆగస్టు 29: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దాడులను నిరసిస్తూ గురువారం ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు చెన్నూరులోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ప్రజలకు ప్రాథమిక వైద్యం అందిస్తున్న తమపై ప్రభుత్వం దాడులు చేయడం సరికాదన్నారు. ప్రజలకు వైద్యం చేయకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం కొత్త బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయల వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందించారు. చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన ఆర్ఎంపీ,పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభల పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 29: ప్రగతి శీల మహిళ సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర మహాసభల పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో హైద్రాబాద్‌లో మహాసభలు జరగనున్నాయని, వీటికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరుణ, మంగ, నర్సక్క, మహేశ్వరి, అనూష, స్వప్నమౌనిక తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను మాదారం టౌన్‌షిప్‌లో సంఘం నాయకురాల్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఆగస్టు 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగే మహాసభలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నాగలక్ష్మీ, శకుంతల, మల్లేశ్వరి, ఓదమ్మ, లక్ష్మీచంద్రమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

2న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

మందమర్రి టౌన్, ఆగస్టు 29: నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని, దీంతో సామాన్య ప్రజలు జీవించలేని పరిస్థితులు నెలకొన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, దుర్గరాజులు పేర్కొన్నారు. గురువారం సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ధరలను నియంత్రించడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. ధరలు నియంత్రించాలని సెప్టెంబర్ 2న ఛలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టామని, ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. వెంకన్న, పద్మ, రసూల్, రాజన్న, కుమార్ పాల్గొన్నారు.


చెన్నూరు: కలెక్టరేట్ ఎదుట 2వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రేగుంట చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. పౌలు, సమ్మయ్య, పురుషోత్తం, మధునయ్య, శంకర్, రాయమల్లు, చిన్నశంకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 29: వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గురువారం జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి బ్రహ్మారావు, వ్యవసాయాధికారి కల్పన, డీఆర్‌డీవో కిషన్, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్‌లతో కలిసి రైసుమిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఏగ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 కనీస మద్దతు ధర చెల్లించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు కనీస వసతులు కల్పించాలన్నారు. రైస్‌మిల్లులు సకాలంలో ధాన్యాన్ని దిగుమతి చేసుకుని లారీలను తిరిగి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకళ, రైసుమిల్లర్ల సంఘం అధ్యక్షుడు కాంతయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.







గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లి, ఆగస్టు 29: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదుట అక్రమంగా గంజాయిని తరలిస్తున్న బెల్లంపల్లికి చెందిన నాగమల్ల దత్తాత్రేయను గురువారం అరెస్టు చేసినట్లు టూ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లగా అనుమానాస్పదంగా కనిపించిన దత్తాత్రేయను తనిఖీ చేయగా 116 గ్రాముల గంజాయి లభించిందన్నారు. నిందితున్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.













విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించరూ



మంచిర్యాల అర్బన్, ఆగస్టు 29: జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో జరుగుతున్న 60 ఫీట్ల రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. రోడ్డు పనులు రెండేండ్లుగా నడుస్తూనే ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, స్తంభాలను పూర్తి స్థాయిలో పక్కకు జరపకపోవడంతో రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం కలుగుతోంది. సాయిబాబా ఆలయం సమీపంలోని బహుళ అంతస్తుతో పాటు దాని పక్కనే ఉన్న మరో రెండు భవనాలు రోడ్డు విస్తరణలో కొంత తొలగించాల్సి ఉంది. ఇండ్ల యజమానులు కేవలం గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే అధికారులు మార్కింగ్ చేసినవరకు తొలగించారు. పై అంతస్తును ఎలాంటి సెట్‌బ్యాక్ చేయకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా మున్సిపల్ అధికారులు ఆ భవనాల పై అంతస్తులను తొలగిస్తేనే ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను ప్రక్కకు జరిపేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించిన అధికారులు ఈ భవనాల తొలగింపులో ఎందుకు జాప్యం వహిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కాసిపేట, ఆగస్టు 29: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ పెద్దనపల్లి మైక్రోస్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తులను బైక్ వెనక నుంచి ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలైనట్లుఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. హైద్రాబాద్ నుంచి సోమగూడెంలోని కల్వరీ చర్చిలో జరిగే ప్రార్థనలకు కొందరు బుధవారం రాత్రి భాగ్యనగర్ రైలులో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో దిగారు. రైల్వేస్టేషన్ నుంచి చర్చికి కాలినడకన వస్తుండగా దుబ్బగూడెంకు చెందిన దుర్గం అంజయ్య బైక్‌పై బెల్లంపల్లి నుంచి సోమగూడెం వస్తూ నడుచుకుంటూవెళ్తున్న వారిని వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో నలుగురు చెల్లాచెదురై గాయాలపాలయ్యారు. గంద్రతి భిక్షపతి, గడ్డమీటి వెంకటి, తాటికాయల భిక్షపతి, కొండ సైదులుతోపాటు ఢీకొట్టిన అంజయ్యకు గాయాలైనట్లు తెలిపారు. గాయాలపాలైన క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. క్షతగాత్రుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

భీమారం, ఆగస్టు 29: గోత్రాలగూడం స్టేజీ దాటిన తర్వాత దాంపూర్ గ్రామానికి చెందిన తాళ్ల రాజును ఈ నెల 18న కారు ఢీకొట్టి ఆగకుండా పోయిందని ఎస్ఐ రాములు తెలిపారు. కారు డ్రైవర్ వేగంగా నిర్లక్ష్యంగా నడపంతో ప్రమాదం జరిగిందన్నారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కారు వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712656552 , 9908715317 లకు తెలియజేయాలని ఎస్ఐ సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కన్నెపల్లి, ఆగస్టు 29: మండలంలోని వీగాం మెయిన్‌రోడ్డులోని బస్టాప్ వద్ద గురువారం ఎస్ఐ గంగారాం రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, దొంగతనాలకు పాల్పడిన వారిని సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

మందమర్రిటౌన్, ఆగస్టు 29: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఓ భక్తుడు సీతారాముల విగ్రహాలను విరాళంగా అందజేయడంతో కల్యాణాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్థికసాయం

దండేపల్లి,ఆగస్టు 29: రెబ్బనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అటెండర్ శనిగారపు రాజలింగుకు రూ.10వేల ఆర్థికసాయాన్ని గురువారం అతని కుటుంబసభ్యులకు అందజేశారు. గోపి, తిరుపతి, శ్యాంసుందర్, చారి, లచన్న, నారాయణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి

కోటపల్లి, ఆగస్టు29: పుల్లగామప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావుల రాజమల్లయ్య (58) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యానికి గురికాగా హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసు పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 29: రాజీవ్‌నగర్‌కు చెందిన నర్సింహ(20) అనేయువకుడు గురువారంరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజులక్రితం కుక్క కరవడంతో పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొడుకు ఖాళీగా ఉండటంతో తల్లి అతన్ని మందలించింది. మనస్థాపానికి గురైన నర్సింహ ఏసీసీ సమీపంలో గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

త్వరలోనే డ్రై రిసోర్స్ సెంటర్ సేవలు

● తుది దశకు చేరుకున్న పనులు

● తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు చర్యలు



కాగజ్‌నగర్‌లో పూర్తైన డీఆర్సీ భవనం

కాగజ్‌నగర్, ఆగస్టు 29: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో డ్రై రిసోర్స్ సెంటర్(డీఆర్సీ) భవననిర్మాణం తుదిదశకు చేరుకుంది.2022లో రూ.1.20 కోట్లతో ఈ భవనం నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిధులు విడుదలవడంతో పనులను ప్రారంభించారు. ఈ భవనం నిర్మాణం పూర్తవడానికి రాగా అధికారులు డీఆర్సీ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో రెండు మిషనరీలను ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలో పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తను ఈ డీఆర్సీ భవనంలో వేస్తారు. తర్వాత అందులో నుంచి తడి, పొడి చెత్తను వెర్వేరు చేయనున్నారు. తడి చెత్తతో కంపోస్టు తయారు చేయనున్నారు. ఇది పంటల్లో అధికదిగుబడికి ఎంతగానో దోహదపడుతుంది. అదేవిధంగా పొడిచెత్త నుంచి ప్లాస్టిక్, ఐరన్‌వాటిని వేరుచేసి స్క్రాప్‌గా అమ్మనున్నారు. వ్యర్థాలను వృథా పోనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ డీఆర్సీని ఏర్పాటు చేసింది.

అందరికీ ఉపయోగమే..

-అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



డ్రైరిసోర్స్ సెంటర్ అందరికీ ఉపయోగం ఉండనుంది. వార్డుల్లో సేకరించిన చెత్తద్వారా రెండు మిషనరీల ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేస్తాం. తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేస్తాం. ఈ ఎరువు పంటలు పెరుగుదలకు, అధిక దిగుబడికి మేలు చేసే అవకాశం ఉంది. అలాగే పొడిచెత్త నుంచి ప్లాస్టిక్, ఐరన్ ఇతర వాటిని వేరు చేస్తాం. వీటితో పాటు వాతావరణ మార్పులు, పంటల ప్రభావం తదితర అంశాలపై రైతులకు అవగాహన పరిచేందుకు డీఆర్సీ వేదిక కానుంది.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 29: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3 దశల్లో గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, పురపాలక సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, సెప్టెంబరు 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్, 21న తుది ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. రాజకీయ పార్టీలతో పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాపై చర్చించాలన్నారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సమస్యాత్మ కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో రాములు, భూసేకరణ ప్రత్యేకాధికారి చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జన్నారం, ఆగస్టు 29: కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ అధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. ఆయన మాట్లాడుతూ అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగి మంటలు అంటుకుంటే ముందుగా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాలని, అప్పటి వరకు నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించాలి

దండేపల్లి, ఆగస్టు 29: పొలాల అమావాస్యను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి గోళ్ళ రాజమల్లు పిలుపునిచ్చారు. గురువారం దండేపల్లిలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో నేతకానిలకు సముచిత స్థానం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. దండేపల్లి అధ్యక్ష కార్యదర్శులుగా సాయిని రాజలింగు, దుర్గం గురువయ్య, గౌరవ అధ్యక్షుడిగా టేకుమట్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా బొర్లకుంట సుదాకర్, సల్లూరి ఏసన్న, గొల్ల మల్లేష్, పలు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మానవ జీవితంలో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం



బహుమతులు పొందిన ఉద్యోగులతో కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 29: మానవ జీవితంలో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని, క్రీడలతో శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్‌లతో కలిసి మెడల్స్ ప్రదానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయక్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు దుర్గప్రసాద్, జెడ్పీ సీఈవో గణపతి నాయక్, అధికారులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో గురుకృప స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ జయంతి నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడా జ్యోతిని వెలిగించి మైదానం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: సింగరేణి పాఠశాల ఆవరణలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. జాతీయ క్రీడాకారుడు ఇటీవల అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన శనిగారపు క్రాంతిని సన్మానించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్‌కుమార్, సేవాదల్ జిల్లా అధ్యక్షుడు పాషా మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సురేందర్, సాగర్, సంపత్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిలక్ స్టేడియంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రభుత్వ పాఠశాలల పీడీలు బండి రవి కుమార్, ఎస్‌కె రాజ్‌మహ్మద్, ఎండీ చాంద్ పాషా, పీఈటీ సంతోష్‌ను సన్మానించారు. ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్, రాజన్న, ఆదర్శవర్ధన్‌రాజు, రాజం, నగేష్, నర్సయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

దండేపల్లి: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని వెల్గనూర్, గుడిరేవు ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేశారు. పాఠశాల మైదానంలో కబడ్డీ, ఫుట్‌బాల్, ఖోఖో పోటీలను నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

మంచిర్యాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. హాకీ మాంత్రికుడు, పద్మభూషన్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్‌ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

కన్నెపల్లి: జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.



వెల్గనూర్ పాఠశాలలో విద్యార్థులకు పోటీలు

గంజాయి రవాణా, విక్రయిస్తే పీడీ యాక్టు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 29: గంజాయి రవాణా, విక్రయిస్తే పీడీ యాక్టు అమలు చేయాలని సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల సబ్ డివిజన్ ఏసీపీ, సీఐ, పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలని, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో దర్యాప్తును పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పారదర్శకంగా దర్యాప్తు జరిపి సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలతో చట్టపరిధిలో నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. నెల వారి ప్రణాళిక ముందుగానే తయారు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఆపదలో ఉపయోగించే డయల్ 100 కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బోర్డులు, సూచికలు, మూల మలుపుల వద్ద, స్పీడ్ లిమిట్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, పాల్గొన్నారు.

3 నుంచి నంబర్ ప్లేట్స్‌పై స్పెషల్ డ్రైవ్

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వాహనాల నంబర్ ప్లేట్స్ ఉండాలని, లేదంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీపీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు అర్హత లేకున్నా పోలీస్, ఆర్మీ, ప్రెస్ స్టిక్కర్లతో తిరుగుతున్నారని, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. నంబర్ ప్లేట్లను ఇష్టం వచ్చినట్లుగా మార్చేయడం, ట్యాంపరింగ్ చేయడం నేరమని, రవాణ శాఖ నిబంధనలకు అనుగుణంగా హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ) తప్పనిసరిగా ఉండాలని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబరు ప్లేట్లను 2వ తేదీలోగా నిబంధనల ప్రకారంగా మార్చుకోవాలని, 3వ తేదీ నుంచి రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని సీపీ హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

దండేపల్లి,ఆగస్టు 29: తాళ్ళపేట గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా 12 ఏళ్లు పని చేసి బదిలీపై వెళుతున్న వడ్డెపల్లి సత్యనారాయణను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నాయకులు, గ్రామస్థులు సన్మానించారు. ప్రజలకు అందుబాటు ఉండి సేవలందించారన్నారు. మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, మాజీ సర్పంచు కుర్సెంగ కళావతి, మాజీ ఉప సర్పంచు పుట్టపాక తిరుపతి, కార్యదర్శి సత్తయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

భీమారం, ఆగస్టు 29: బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం స్పెషలిస్టు ఇన్ ఫైనాన్స్ లిటరసీ అధికారి లిఖిక స్త్రీ సాధికారత, హక్కులు, మహిళల చట్టాలు, హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులకు సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మీ, సంధ్యారాణి, కరుణ పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుకు ఎంపిక

హాజీపూర్, ఆగస్టు 29 : ఇటీవల విడుదలైన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఫలితాల్లో హాజీపూర్ మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన ఇత్తినేని కార్తీక్ ఎంపికయ్యాడు. కార్తీక్ కోరుట్లలోని కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోర్సు పూర్తి చేశాడు. ఉద్యోగం రావడంతో కార్తీక్‌ను గ్రామస్థులు అభినందించారు.

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్....

పీఏసీఎస్ సెక్రెటరీ సస్పెన్షన్

-ఉత్తర్వులు జారీ చేసిన కో ఆపరేటివ్ అధికారి

మంచిర్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యదర్శి పెంట సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ప్రత్యేక డిప్యూటీ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ కో ఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 'మాఫీ తేల్చిన పంట రుణం స్వాహా' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. హాజీపూర్ మండలం ముల్కల్లకు చెందిన సిరిపెల్లి బాపు రుణం తీసుకోకపోయినా 30-07-2024న రూ.1,10,515 పొందినట్లు సెల్‌ఫోన్‌కు ఆగస్టు 2న మెసేజ్ వచ్చింది. దీంతో పీఏసీఎస్‌లో ఆరా తీయగా కార్యదర్శి పెంట సత్యనారాయణ వైఖరి అనుమానాస్పదంగా ఉండటంతో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాడు. తన పేరిట రుణం మంజూరైందని తెలుసుకున్న బాపు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆఫీసర్ విచారణ జరిపారు. విచారణలో సిరిపెల్లి బాపు చెందిన రుణమాఫీని కార్యదర్శి సత్యనారాయణ అక్రమంగా పొందినట్లు వెల్లడైంది. కార్యదర్శి పెంట సత్యనారాయణ రైతుల సొమ్మును సొంతానికి వాడుకోవడం, విధులు నిర్వర్తించడంలో విఫలమైనందున సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలుగు భాషను మరవద్దు

దండేపల్లి ఆగస్టు 29 : పరభాష మోజులో పడి తెలుగు భాషాను మరచిపోవద్దని గుడిరేవు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషా పట్ల చేసిన సేవలను కొనియాడారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మంచిర్యాల అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, తెలుగు అధ్యాపకురాలు రజిత పాల్గొన్నారు.

స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 29 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో 368 మంది విద్యార్థినులు ఓటు హక్కు వినియోగించుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ పత్తి సునీత తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకుల, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

కాసిపేట, ఆగస్టు 29: అవుట్‌రీచ్ మ్యాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం సామూగూడలోని 14 మంది గిరిజన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లు అందజేశారు. సంస్థ కో ఆర్డినేటర్ ఎం.స్టీవెన్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడితే అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా కుట్టుమిషన్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. సంస్థ కన్వీనర్ కల్లెం జాషువా, రత్న విజయ్ కుమార్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



స్థల పరిశీలన చేస్తున్న అదనపు కలెక్టర్లు

వాంకిడి, ఆగస్టు 29: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆయన అదనపు కలెక్టర్ వేణు, డీఈవో అశోక్, తహసీల్దార్ రియాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సమయానుసారం మెనూప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. వారి ఆరోగ్యస్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం వాంకిడి-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, వంట సామగ్రి, పరిసరాలను పరిశీలించారు. అంగన్‌వాడీకేంద్రాల ద్వారాగర్భిణులు, పిల్లలసంక్షేమందిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీఎస్‌వోవిజయలక్ష్మితదితరులు ఉన్నారు.

కోట్నాక భీంరావు వర్ధంతి



సిర్పూర్(యు)లో భీంరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బెజ్జూరు/సిర్పూర్(యు), ఆగస్టు 29: మండలకేంద్రంలో ఆదివాసీ భవనంలో మాజీగిరిజనశాఖ మంత్రి కోట్నాకభీంరావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన గిరిజనాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. సిర్పూర్(యు)లో మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు కోట్నాకభీంరావు ఆదివాసీల బాంధవుడు అని అన్నారు. మండలకేంద్రంలోని గాంధీచౌక్‌లో కోట్నాక భీంరావు విగ్రహానికి ఆయనతోపాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెజ్జూరులో జరిగిన కార్యక్రమంలో శంకర్, తిరుపతి, సాయి, బక్కయ్య, వెంకటేష్, వినోద్,రమేష్, నితిన్, శ్రీరామ్, హరిప్రసాద్, ప్రదీప్, అరవింద్, సిర్పూర్(యు)లో మాజీసర్పంచులు ఆత్రం ఓం ప్రకాష్, ఆర్క నాగోరావు, మెస్రం భూపతి, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి తీవ్ర అస్వస్థత



ఎమ్మెల్యే కోవ లక్ష్మిని హైదరాబాద్‌కు తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 29: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ గురువారం తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆసిఫాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రివైద్యులు పరీక్షించి ఎమ్మెల్యేకు జ్వరంతోపాటు రక్తపోటు అధికంగా ఉందనిగుర్తించారు. అలాగే ఆక్సిజన్ లెవల్ తగ్గి శ్వాసతీసు కోవడం ఇబ్బందిగా మారింది. దీంతో వైద్యులు ప్రథమ చికిత్సచేసి పరిస్థితి నిలకడగానే ఉందని మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. ఈమేరకు కుటుంబసభ్యులు ఎమ్మెల్యే కోవలక్ష్మిని వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలించారు.

బెజ్జూరు పీఏసీఎస్‌లో పదికోట్ల అవినీతి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, ఆగస్టు 29: బెజ్జూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పదికోట్ల అవినీతి జరిగిందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. గురువారం మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పదికోట్ల అవినీతి అక్రమాలు జరిగాయని సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. రైతులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు. బెజ్జూరు కోఆపరేటివ్ సొసైటీలో డిపాజిట్లు చేద్దామని రైతులు వస్తే ప్రైవేటు కోఆపరేటివ్ సొసైటీలో డిపాజిట్‌లు చేసి రైతులను మోసం చేశారని ఆరోపించారు. జిల్లాలోని బెజ్జూరు, దహెగాం, రెబ్బెన సొసైటీలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి అవినీతి అక్రమాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కె సత్యనారాయణ, డి శ్రీశైలం, అశోక్, కెశంకర్, బాలకృష్ణ, మధుకర్, వసీఖాన్, బాపు, రామయ్య, మోహన్, తిరుపతి, దిగంబర్, సత్యనారాయణ, సంతోష్, నాగేష్‌మల్లయ్యహనుమంతుతదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే.

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే హరీష్‌బాబు తనిఖీచేశారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అలాగే డెలివరీలు ఎక్కువ సంఖ్యలో జరిగేట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

చట్టాలపై అవగాహన

చింతలమానేపల్లి/జైనూర్, ఆగస్టు 29: చింతలమానేపల్లి మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, జైనూరు బాలికల ప్రభుత్వ ఆశ్రమోన్నతపాఠశాల విద్యార్థులకు కాగజ్‌నగర్, జైనూరుషీటీం, జిల్లా భరోసాటీం సభ్యులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరోసా టీం ఇన్‌చార్జి ఎస్సై తిరుమల బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పోక్సోచట్టం, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైం, మహిళలపై హింస, బాల్యవివాహాలు, అత్యాచార బాధితులు భరోసా సెంటర్‌ను ఎలా ఆశ్రయించవచ్చు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో భరోసా సెంటర్8712670561, 8712670565, 8712670564, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, షీటీం, భరోసాటీం సభ్యులు, జైనూర్‌లో షీటీంసిబ్బందిసునీత,స్వప్న,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

సిర్పూర్(యు), ఆగస్టు 29: మండలంలోని కోహినూర్ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమపాఠశాలలో గురువారం జాతీయ క్రీడాదినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాలతోస్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకవెంకటేశ్వరావు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి

లింగాపూర్, ఆగస్టు 29: ఓటరు నమెదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్‌వర్మ అన్నారు. గురువారం మండలంలోని వావునూర్ గ్రామంలో బీఎల్‌వో నిర్వహిస్తున్న ఓటరునమోదు కార్యక్ర మాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. మరణించిన వారిని జాబితనుంచి తొలగించా లన్నారు. ఆయన వెంట ఆర్ఐ ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ

కౌటాల, ఆగస్టు 29: మండలకేంద్రంలో గురువారం ఏఈవోలు రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవో ఘన్‌శ్యాం, అంజన్న, సిద్ధార్థ, రేష్మిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 29: విద్యార్థులకు మెనూప్రకారం పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిసరాలు, రిజిష్టర్లు, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెనూప్రకారం పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు.



అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న రైతులు

మార్కెట్లో పొలాల అమావాస్య సందడి

జైనూర్, ఆగస్టు 29: మార్కెట్లో పొలాల అమవాస్య సందడి నెలకొంది. బసవన్నలను అలంకించేందుకు జైనూరుమార్కెట్లో రైతులు సందడిపెరిగింది. గురువారం సంత రోజున రైతులు ఎడ్లను రంగురంగులతో అలకరించేందుకు రకరకాల వస్తువులను కొనుగోలు చేశారు. అదేవిధంగా ఆ రోజు ప్రత్యేక నైవేద్యం తయారు చేసి ఎడ్లకు పూజలు చేసి తినిపిస్తారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

వాంకిడి, ఆగస్టు 29: మండంలోని బంబార గిరిజనఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, ఏఎన్ఎం సునంద, లక్ష్మి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, ప్రధానోపాధ్యాయు రాలు లక్ష్మిప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్సురెన్స్ చెక్కు అందజేత

కౌటాల, ఆగస్టు 29: మండలంలోని విజయనగరం గ్రామానికిచెందిన పిబాలస్వామి ప్రమాదవశాత్తు మరణించడంతో అతనిభార్య జ్యోతికి గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఎస్బీఐ జనరల్ బీమా కింద రూ.20 లక్షలచెక్కును ఆర్ఎం మురళీమోహన్‌రావు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ రమేష్, ఎఫ్ఓ శ్రీనివాస్, ప్రదీప్,వంశీధర్,సురేష్,గోపి,వాగుమేర, ఏపీఎం ముక్తేశ్వర్, సీఏలు, సీసీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిపై దృష్టి సారించాలి: డీఐఈవో

సిర్పూర్(టి), ఆగస్టు 29: ఇంటర్మీడియట్, కేజీబీవీలో విద్యార్థుల విద్యాభివృద్ధిపై దృష్టి సారించాలని డీఐఈవో కల్యాణి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కేజీబీవీ, ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఆమె తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతి, లెక్చరర్‌లు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

పరిహారం చెక్కు అందజేత

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి గ్రామానికి చెందిన గుబిడే ఉదయ్‌కిరణ్ గతేడాది విద్యుదా ఘాతంతో మృతిచెందగా బాధితకుటుంబానికి విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ అరుణ రవీందర్, డీఈఈ జీవరత్నం, ఏడీఈ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

ఆసిఫాబాద్: రైతులకు రెండులక్షల రుణమాఫీ చేయాలని గురువారం సీపీఎం నాయకులు దినకర్, కార్తీక్, రాజేందర్, టికానంద్ తదితరులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

వాంకిడి: తెలుగుభాషా దినోత్సవాన్ని గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుపతి, సురేందర్, రాజమౌళి, కిరణ్, తిరుపతి, శ్రీధర్, రామదాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

సిర్పూర్(యు): గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై రామకృష్ణారావు ప్రజలను కోరారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. గణేష్‌ఉత్సవాలను ప్రజలందరు కలిసి మెలసి శాంతియుతంగా జరుపుకోవాలన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

సిర్పూర్(టి): నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆపార్టీనాయకులు పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో పార్టీ సభ్యత్వ నమోదుపై చర్చించారు.

మండల మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం

బెజ్జూరు: మండల మధ్యాహ్నబోజన కార్మికుల సంఘం కార్యవర్గంను ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమాచారి తెలిపారు. అధ్యక్షురాలిగాబాయక్క, కార్యదర్శిగా సువర్ణ, గౌరవఅధ్యక్షురాలిగా కళక్క, సహాయకార్యదర్శిగా శారద, కోశాధికారిగా సునీత, ఉపాధ్యక్షురాలిగా విజయ,లక్ష్మి,పద్మ,సభ్యులుగాఅమృత,యశోద, గంగామణిని ఎన్నుకున్నారు.

ఘనంగా వీడ్కోలు

బెజ్జూరు: సోమినిగిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం భుజంగరావు బదిలీపై కుంటలమానేపల్లికి వెళ్లడంతో గురువారం సోమిని పాఠశాలలో ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం భిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
8
శుక్రవారం 30 ఆగస్టు 2024



రైతులకు పూర్తి రుణవిముక్తి కలిగేనా?

- రుణమాఫీ కాని రైతుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్
- ఇప్పటికే జిల్లాలో వందల సంఖ్యలో దరఖాస్తులు

సర్వే ఇలా..

చింతలమానేపల్లి/కాగజ్‌నగర్: జిల్లాలో చాలామంది రేషన్ కార్డు లేకపోవడంతో ఆధార్ కార్డులో తప్పులు, పట్టా పాసుపుస్తకాల పేరుతో వివరాలు సరిపోకపోవడం వంటి కారణాలతో రుణమాఫీ దూరమాయ్యరు. కాగజ్‌నగర్ మండలంలో 833మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నది సమాచారం. మంగళవారం నుంచి వ్యవసాయాధికారులు రుణమాఫీ వర్తించని రైతుల వద్దకు వెళ్తున్నారు. తొలుత వారి లోన్ అకౌంట్లు, ఆధార్ కార్డులు తనిఖీ చేస్తారు. అనంతరం కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా తీసుకుని యాప్‌లో నమోదు చేస్తారు. పంటరుణాలు బకాయిలున్న భార్యభర్తలే కాకుండా ఇంట్లో 18సంవత్సరాలు దాటిన వారి కుటుంబ సభ్యుల ఫొటో కూడా తీసుకుంటున్నారు. అందులో యజమాని తన లోన్‌అకౌంట్,సంబంధిత బ్యాంకు బ్రాంచి వివరాలతోపాటు రుణమాఫీ కోసం కుటుంబ సభ్యుల వివరాలను ఇష్ట పూర్వకంగా రాసి ఇస్తున్నట్లు పేర్కొంటూ సంతకం చేయాల్సి ఉంటుంది. అందులోనే ఫోన్ నంబర్‌రాయాలి. పూర్తి వివరాలు నమోదు చేసుకున్న అనంతరం యాప్‌లో నమోదు చేస్తారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వేలో భాగంగా సేకించిన ఓ రైతు వివరాలు నమోదైన తరువాత రైతు నుంచి ధ్రువీకరణ పత్రం, స్థానిక పంచాయతీ కార్యదర్శి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది.


కాగజ్‌నగర్‌లో రైతు ఇంటికి వచ్చి సెల్ఫీ తీస్తున్న వ్యవసాయ అధికారి రామకృష్ణ

చింతలమానేపల్లి, ఆగస్టు 29: జిల్లా వ్యాప్తంగా చాలామంది అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదు. రేషన్‌కార్డు, ఇతర సాంకేతిక కారణాలతో బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మూ డోవిడత తరువాత కూడా మాఫీ కాని రైతులనుంచి వ్యవసాయశాఖాధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఈనెల 28నుంచి వ్యవసాయ శాఖాధికారులు నేరుగా రైతుల ఇళ్లకు వెళ్లి రుణమాఫీ కాని రైతులనుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఏడీఏ, ఏవో కార్యాలయాతోపాటు రైతు వేదికల్లో ప్రతిరోజు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటున్నారు. అలాగే రుణమాఫీ వర్తించని రైతుల వివరాలు క్షేత్రస్థాయిలో సేకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివరాలు సేకరణ కోసం ప్రత్యేకంగా రైతు భరోసా పంట రుణమాఫీ యాప్ రూపొందించారు. ఈ యాప్ ఇప్పటికే జిల్లా వ్యవసాయ శాఖాధికారులకు పంపించారు. వ్యవసాయ విస్తర్ణ అధికారులు మంగళవారం నుంచి సర్వే చేపడు తున్నారు. ముందుగా ప్రయోగాత్మకంగా కొందరి రైతుల వివరాలు నమోదు చేసి పరీక్షించాలని ఆదేశించడంతో ఇప్పటికే జిల్లా వ్యవసాయాధికారులు ప్రయోగాత్మకంగా వివరాలు సేకరించారు.

● జిల్లాలో 48,356 మందికే రుణమాఫీ..

జిల్లాలో 1.38లక్షల మంది రైతులు ఉండగా సుమారు 1.19లక్షల మందికి రుణాలు తీసుకున్నట్లు సమాచారం. వీరిలో లక్ష లోపురుణాలు తీసుకున్న రైతులు 22వేల మందికి తొలివిడతలో రూ.125.20 కోట్లు, రెండో విడతలో రూ.1.5లక్షల లోపు తీసుకున్న వారు 14,623మందికి రూ.253.34 కోట్లు, మూడో విడతలోరూ.2లక్షల లోపు తీసుకున్న వారు 11,733 మందికి రూ.154.40 కోట్లు రుణాలు మాఫీచేశారు. మొత్తం 48,350మందికి రైతుల ఖాతాల్లో రూ.582, 94,3006నగదు జమచేశారు.

● వందల సంఖ్యలో ఫిర్యాదులు..

రుణమాఫీ అందని రైతులు ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుచేయ డంతో పాటు కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. రుణమాఫీ కాని రైతులతో పాటు రూ.2లక్షలకుపైగా రుణం ఉన్నవారు కూడా దర ఖాస్తు చేసుకుంటు న్నారు. మాఫీ ఎందుకు కాలేదని బ్యాంకుఅధికారులను అడిగితే వ్యవసాయాధి కారుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఆధార్‌కార్డు ద్వారా చెక్‌చేస్తే నో డేటా ఫౌండ్ అని వస్తుందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు లేక పోవడం, ధ్రువపత్రాల్లో పేరు తప్పుగా నమోదు కావడం, ఇతర సాంతికేక కారణాలతో మాఫీ కాని రైతులు ఇప్పటివరకు 11,026మంది ఫిర్యాదులు అందించారు. వివరాలు పరిశీలించిన అనంతరం అధికారులు ఏఈవోలతో సర్వే చేపడుతున్నారు. ప్రస్తుతం 15మండలాలకు ఒక్కో నోడల్ అధికారిని నియమించారు. అయితే బ్యాంకర్లు,సహకార సంఘాల తప్పిదాలతోనే అన్నదాతలు మూల్యం చెల్లిం చాల్సి వస్తోంది. ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్ 2018 డిసెంబరు12కు ముందు రుణాలు తీసుకున్న రైతులు ఆ తరువాత ఏటా రుణాన్ని రెన్యూవల్ చేసుకుంటున్నారు. రెన్యూవల్ చేసిన తేదీ నుంచి కొత్త రుణంగా పరిగణించాలి. సదరు రుణానికి సంబంధించి కొత్త ఖాతా నెంబర్ ఉంటుంది. బ్యాంకర్లు 2018డిసెంబర్ 12కు ముందు తీసుకున్న రైతులరుణాలను వారు ఏటా రెన్యూవల్ చేసుకున్నా కొత్త తేదీలు ఇవ్వలేదు. వారు పాత జాబితాలో ఉండడంతో అనేక మంది అనర్హులుగా మిగిలారు.

త్వరగా పూర్తిచేస్తాం..

-రామకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి, కాగజ్‌నగర్

రూ.2లక్షల లోపు ఉన్న రుణాలకు క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించాం. రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను రైతులకు అవగాహన పరుస్తున్నాం. త్వరితగతిన పూర్తి చేసి రుణ మాఫీ క్లియరెన్స్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

క్రీడలతో మానసికోల్లాసం: కలెక్టర్, ఎస్పీ


ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 29: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీడీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. భారతహాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో క్రీడాపోటీలను ప్రారంభించారు. అంతకుముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా క్రికెట్,చెస్,క్యారం తదితరపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఫైనల్‌మ్యాచ్‌లో పోలీస్-టీచర్స్ మధ్య పోటీ నెలకొనగా పోలీసుటీం విజేతగా నిలిచింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, డీడీ రమాదేవి, డీఈవో అశోక్, డీఎస్పీ సదయ్య, సీఐసతీష్, డీసీఆర్బీసీఐ రాణాప్రతాప్‌తదితరులు పాల్గొన్నారు.

పూలాజీబాబా జయంతి వేడుకలు ప్రారంభం


జెండాకు మొక్కుతున్న భక్తులు

జైనూర్, ఆగస్టు 29: మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో పూలాజీబాబా 100వజయంతి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిద్ధేశ్వర్ సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్‌రావ్, ఆయన సతీమణి గీత, జిల్లాగౌరవఅధ్యక్షుడు వామన్‌రావ్‌ఇంగ్లే, బాబాసతీమణి ద్రుపదబాయి, పోలీసు అధికారులు ఏఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్య తదితరులు ప్రత్యేకపూజలు చేసి జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా వేడుకలకు హాజరైనభక్తుల కోసం అన్నదానం, వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు సకల ఏర్పాట్లు చేయాలని జిల్లా అధ్యక్షుడు కేశవ్‌రావ్ ఇంగ్లే కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ బీర్షావ్, సీఐలు చిట్టిబాబు, రమేష్, ఎస్ఐ సాగర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషిచేసిన నేత భీంరావు


భీంరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 29: ఆదివాసుల సంక్షేమం కోసం కృషిచేసిన గొప్పనేత కొట్నాక భీంరావు అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్‌లో గురువారం నిర్వహించిన భీంరావు 22వ వర్ధంతికి అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, మాజీఎమ్మెల్యేఆత్రంసక్కు,బీఆర్ఎస్ నాయకురాలు, భీంరావు కుమార్తె సరస్వతితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా భీంరావు పనిచేశారన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు, భీంరావు కుమార్తె సరస్వతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీపాదరావు వర్ధంతిని అధికారికంగా నిర్వహించి ఆదివాసీ నాయకుడైన భీంరావు వర్ధంతిని నిర్వహించకపోవడం ఆదివాసీలను అవమానించడమేనన్నారు. ప్రభుత్వం భీంరావు వర్ధంతిని ప్రభుత్వపరంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, కోవ లక్ష్మి తనయుడు కోవ సాయినాథ్, బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు జాబరి రవిందర్, మాజీఎంపీపీసౌందర్య, మాజీజడ్పీటీసీలు వెడ్మకమల, ద్రుపదబాయి, జీసీడీవో శకుంతల తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి

కెరమెరి/సిర్పూర్(టి), ఆగస్టు 29: సెప్టెంబరు1వతేదీని పెన్షన్‌విద్రోహ దినంగా పాటించాలని ఉద్యోగ,ఉపాధ్యాయసంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యా యులందరూ పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగసంఘాల నాయకులు ప్రకాష్,చంద్రశేఖర్,భాస్కర్,విద్యాసాగర్,సమ్మయ్య,సంతోష్, సిర్పూర్ (టి)లోనాయకులు హరీష్,పురుషోత్తం,శ్రీనివాస్‌గౌడ్,వెంకటరమణ, సుధాకర్ బాబు, రామ్మోహన్, రవికుమార్,దేవరావు,నగేష్,సంతోష్,ఆఫీసుద్దీన్‌పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, తదితరులు

ఆసిఫాబాద్, ఆగస్టు 29: గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్రఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపుకలెక్టర్‌లు, పంచాయతీ అధికారులు, ఆర్డీవోలు, డీపీవోలతో ఎన్నికల నిర్వహణ, ఓటరుజాబితా రూపకల్పన, పోలింగ్‌సిబ్బంది వివరాలసేకరణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బ్యాలెట్‌బాక్సుల లభ్యతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికలకమిషనర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేవిధంగా జిల్లా ఎన్నికల అధికారులు పర్యవేక్షించాలన్నారు. 18సంవత్సరాల వయస్సునిండిన ప్రతిఒక్కరూ తమ వివరాలను జాబితాలో నమోదుచేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సరిపడా బ్యాలెట్‌బాక్సుల లభ్యతను పరిశీలించి అవసరమైన మేరకు ప్రతిపాద నలు పంపించాలని తెలిపారు. జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్‌లో వీసీ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్వహణలో భాగంగా 20శాతం అదనంగా పోలింగ్‌సిబ్బందిని నియమిస్తామన్నారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేకచర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి అందుబాటులో ఉండే విధంగా పర్యవేక్షిస్తామని, స్టేజ్1,2 అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేసి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికల బరిలో ఎంపీ రఘునందన్‌రావు


మాట్లాడుతున్న కొంగ సత్యనారాయణ

కాగజ్‌నగర్, ఆగస్టు 29: త్వరలో జరుగనున్న ఎస్పీఎం ట్రేడ్‌యూనియన్ ఎన్నికల్లో ఎంపీ రఘునందన్‌రావు బరిలో ఉంటున్నట్టు బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు, సిర్పూరు పేపర్‌మిల్లు సంఘం అధ్యక్షుడు కొంగ సత్యనారాయణ తెలిపారు. బుధవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎం పునరుద్ధరణ తర్వాత చాలా మార్పులు జరిగినట్టు పేర్కొన్నారు. వీటన్నిటికీ పరిష్కారం మిల్లులో ట్రేడ్‌యూనియన్ ఎన్నికలు అనివార్యంగా పేర్కొన్నారు. అయితే ఈ ఎన్నికల్లో మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు బరిలో నిలువనున్నారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గోలేంవెంకటేష్, రాములు, గోపాల్‌రావు, శ్యాంరావు, శ్రీనివాస్‌రావు, సారంగపాణి లింగపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 29: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు త్వరగాపూర్తి చేయాలని ఎమ్మెల్యే హరీష్ బాబు అన్నారు. గురువారం కాగజ్‌నగర్ మారుతీనగర్‌లో యానిమల్ బర్త్‌కంట్రోల్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ కోసం రూ.25లక్షల నిధులు విడుదలైనట్టు తెలిపారు. పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో కుక్కల బెడద పూర్తిగా తగ్గి పోతోందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ షాహిన్ సుల్తానా, కమిషనర్ అంజయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్ ఆశోక్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 29: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కారించాలని గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐఎమ్మెల్యే కూనంనేనిసాంబశివరావు ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులసమస్యపై వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఏసురత్నం, తదితరులున్నారు.

'అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి'

కాగజ్‌నగర్, ఆగస్టు 29: కాగజ్‌నగర్ మండలం వంజీరి సమీపంలో ప్లాట్ నెం69/1/1లో అక్రమంగా నిర్మించిన దుకాణాన్ని వెంటనేతొలగించాలని పలువురు నాయకులు గురువారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ నిర్మాణంపై కలెక్టర్ సమాచారం ఇచ్చినా, సాక్షాత్తు సీఐ స్థాయి అధికారిస్వయంగా పరిశీలించినా ఇంతవరకుతొలగించటం లేదన్నారు.

రేపు వాలీబాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 29: తిర్యాణి ప్రభుత్వఆశ్రమోన్నత పాఠశాలలో ఈనెల31న అండర్-17,-14బాలురవాలీబాల్ ఎంపికక్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో అశోక్, క్రీడల ప్రధానకార్యదర్శి సాంబశివరావు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ప్రధానోపాధ్యాయుల చేత ఎంట్రీ ఫాం, బోనాఫైడ్‌పై సంతకం చేసి తీసుకురావాలని, ఆధార్ కార్డు జీరాక్స్ తీసుకురావాలన్నారు. మిగితావివరాలకు 9492324005 ని సంప్రదించాలన్నారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విజయం

శ్రీరాంపూర్, ఆగస్టు 29: వర్క్ పీపుల్‌స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్ పోటీలు శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో గురువారం నిర్వహించారు. ఆర్కే-2గ్రూపుజట్టు, శ్రీరాంపూర్‌గ్రూపుజట్టు పోటీపడ్డాయి. చివరకు శ్రీరాంపూర్ గ్రూపుజట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్‌సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో-ఆర్డినేటర్ ఎస్ నర్సయ్య, జనరల్ కెప్టెన్ ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు 35శాతం లాభాల వాటా చెల్లించాలి

జైపూర్, ఆగస్టు 29: సింగరేణి సంస్థ 2023-24ఆర్థిక సంవత్సరం లాభాలు ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి అంబాల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గనిమేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల వేలం పాటలను రద్దు చేసి సింగరేణికే అప్పగించాలని తదితర డిమాండ్లు చేశారు. అన్నికార్మికసంఘాలతో సక్కర్‌సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరికొండ శ్రీనివాస్, నవీన్, కిషన్‌రెడ్డి, శంకర్, వెంకట్‌రెడ్డి, మొయినోద్దీన్ పాల్గొన్నారు.

జన్మభూమి పేరుతో కార్మికులతో వెట్టిచాకిరీ

శ్రీరాంపూర్, ఆగస్టు 29: జన్మభూమి పేరుతో సింగరేణి యాజమాన్యం కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తోందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధానకార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఆరోపించారు. ఆర్‌కే న్యూటెక్ గనిని గురువారం వారు సందర్శించి కార్మికుల సమస్యలు విన్నారు. అనంతరం మాట్లాడుతూ, జన్మభూమి పేరిట వెట్టిచాకిరీ మానుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, పిట్‌కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, అఫ్రోజ్‌ఖాన్, పిట్ సహాయ కార్యదర్శి మంత్రి సందీప్ పాల్గొన్నారు.

శాంతిఖనిలో బ్రేక్‌డౌన్.. నిలిచిన ఉత్పత్తి

బెల్లంపల్లి, ఆగస్టు 29: శాంతిఖని గనిలో బోల్టర్ మైనర్‌కు అందించే విద్యుత్‌కు సంబంధించిన సర్క్యూట్ పవర్ బ్రేక్‌డౌన్ కావడంతో రెండు రోజులుగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. బుధవారం ఉదయం నుంచి గురువారం వరకు బ్రేక్‌డౌన్ కావడంతో దాదాపు 800టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. బ్రేక్‌డౌన్ సమస్య ఎలా వచ్చిందని సంబంధిత అధికారులు తెలుసుకున్నారు. 54వ లెవల్ వద్ద సమస్యను కనుక్కొని మరమ్మతులు చేస్తున్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు సర్క్యూట్ పవర్ బ్రేక్‌డౌన్ కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే ఉత్పత్తికి నష్టం వాటిల్లేది కాదని కార్మికులు పేర్కొంటున్నారు.

సివిల్ విభాగంలో ఈఈ ఇష్టారాజ్యం

- ఆయనకు తోడైన యూనియన్ నాయకుడు
- ఇబ్బందులకు గురవుతున్న ఉద్యోగులు
- న్యాయం చేయాలని వేడుకోలు

శ్రీరాంపూర్, ఆగస్టు 29: సింగరేణికి చెందిన సివిల్‌విభాగంలో ఈఈ ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ఆయన చెప్పిందే వేదం. చేసిందే రూలు. ఆయనకు అదే విభాగంలో పనిచేసే యూనియన్ నాయకుడు తోడయ్యాడు. ఇంకేముంది ఇద్దరూ కలిసి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో తమను ఆదుకునేవారు లేరా అని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

నస్పూర్ ఏరియాలో..

గోదావరి ఇంటెక్‌వెల్ నుంచి శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు నీటి సరఫరా జరుగుతుంది. నస్పూర్ ఏరియాలో 21 మంది పంప్ ఆపరేటర్లు, ఆరుగురు వాల్ ఆపరేటర్లు, ఎనిమిదిమంది జనరల్ మజ్దూర్లు, డిప్యూటేషన్‌పై మరో ముగ్గురు, ఒక సూపర్‌వైజర్, ఒక ఫిట్టర్ పనిచేస్తున్నారు. వీరంతా ఇంటెక్‌వెల్, సీతారాంపల్లి, సీసీసీ టౌన్‌షిప్, జీఎల్ఎస్ఆర్, బంగ్లాస్ ఏరియా, క్రిష్ణకాలనీ, సీసీసీ ప్రాంతాల్లో పనిచేస్తారు.

తరచూ విధులు మారుస్తూ...

సదరు ఉద్యోగులకు ముందస్తుగానే డ్యూటీచార్ట్ తయారుచేసి వాట్సప్ గ్రూపులో సర్క్యులేట్ చేస్తారు. దానిఆధారంగా పనులు కొనసాగుతాయి. అయితే గతంలో మాదిరిగా కాకుండా యూనియన్ నాయకుడు రోజు రోజుకు షిఫ్టుమారుస్తూ యాక్టింగ్‌లు, ప్లేడేలు రాకుండా మూడేళ్లగా చేస్తున్నారని సివిల్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల తమకు ఆర్థికంగా నష్టం జరగడంతోపాటు పదోన్నతులు రాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అంతా ఆయన కనుసన్నల్లోనే..

ఏడేళ్లగా తమ విభాగంలో యూనియన్ నాయకుడు వల్లే తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. చార్ట్ తయారుచేయడం, ప్లేడేలు, యాక్టింగ్‌లు రాకుండా చేయడం ఆయన పనేనంటున్నారు. కానీ తనకుమాత్రం అనుకూలమైన విధులను కేటాయించుకుంటున్నారని తెలిపారు.

పనిచేయని వెల్‌కు ఉద్యోగులు, సొమ్ములు

సింగరేణి లెక్కల్లో గోదావరి ఒడ్డున ఉన్న ఓల్డ్‌వెల్ పనిచేస్తోంది. దానికి ప్రతిరోజు ఉద్యోగులు కేటాయిస్తున్నారు. చిత్రమేమిటంటే దాని నిర్వహణకు గతంలో 3లక్షల రూపాయలు కూడా మంజూరయ్యాయి. కానీవాస్తవానికి ఓల్డ్‌వెల్ పనిచేయడం లేదు. అక్కడ ఉద్యోగులు సైతం పనులు చేయడం లేదు. కానీఈఈ మాత్రం ఫిల్టర్‌బెడ్ రన్నింగ్‌లో ఉన్నట్లు, ఉద్యోగులుపనులు చేస్తున్నట్లు పేపర్లలో చూపుతూ సింగరేణికి నష్టం చేస్తున్నారు. మంజూరైన 3లక్షల రూపాయలు సైతం తన జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎవరికి చెప్పుకోవాలి?

సమస్య వస్తే పరిష్కరించాల్సిన అధికారే తమకు సమస్యగా మారితే ఎవరికి చెప్పుకోవాలని సివిల్ విభాగం ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓల్డ్ ఫిల్టర్‌బెడ్ పనిచేసేలా చూసి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలు

- సత్యనారాయణ, ఈఈ(సివిల్)

ఉద్యోగులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. విధుల్లో భాగంగా కొందరికి షిఫ్టులు మారుస్తున్నాం. దీంతో వారు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఓల్డ్ ఇంటెక్‌వెల్ వరదలు వచ్చినప్పటి నుంచి పనిచేయడం లేదు.

జీఎం కార్యాలయం ఎదుట కాలనీవాసుల ధర్నా

రెబ్బెన, ఆగస్టు 29: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి కార్మికవాడల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండు చేస్తూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో గురువారం కాలనీవాసులు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికవాడల్లో పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని, వారసంతలో సౌకర్యాలు మెరుగుపర్చాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జీఎం శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీచక్రపాణి, మండల ఆర్గనైజర్ నవీన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ బలోపేతానికి కమిటీలు

మందమర్రిటౌన్, ఆగస్టు 29: సింగరేణిలో టీబీజీకేఎస్ బలోపేతనికి అన్నిఏరియాల్లో కమిటీల నియామకానికి అగ్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది. రెండురోజుల క్రితం భూపాలపల్లిలో యూనియన్ కేంద్రకమిటీ సమావేశం నిర్వహించి అన్ని గనులు, డిపార్టుమెంట్లలో కమిటీలను వేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్‌ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి అన్నిఏరియాల నాయకులకు ఆదేశాలకు జారీచేశారు. దీంతో మరో రెండురోజుల్లో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో గనులు, డిపార్టుమెంట్లకు సంబంధించి నూతన కమిటీల ప్రక్రియ చేపట్టనున్నారు. యూనియన్ బలోపేతమే లక్ష్యంగా కమిటీలను వేయనున్నట్లు తెలిపారు.